క్లుప్తంగా

స్టీల్ ప్లేట్ల పంపిణీ



స్టీల్ ప్లేట్లతో విద్యార్థులు, ట్రస్ట్ నిర్వాహకులు

హుజూరాబాద్‌రూరల్: సిర్సపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీలో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ తరఫున స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరామ్ చక్రధర్, రిటైర్డు టీచర్ కోయల్‌కార్ దుర్గాజి పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణ పనులు పరిశీలన



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా స్ట్రీట్ వెండర్స్ కోసం నిర్మిస్తున్న షెడ్లను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు శనివారం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాత మున్సిపల్ ఆవరణలో మున్సిపల్‌లో పని చేస్తున్న శానిటేషన్ సిబ్బందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గాజుల భాస్కర్, పాతకాల రమేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల పనివేళలను పునఃసమీక్షించాలి

తిమ్మాపూర్: గురుకుల విద్యాసంస్థలకు నిర్ణయించిన పనివేళల్లో శాస్త్రీయత లోపించిందని, విద్యార్థులపై ఒత్తిడిని పెంచేలా ఉన్నాయని, వాటిని పునఃసమీక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి కోరారు. నూతన టైం టేబుల్‌ను నిరసిస్తూ తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల(మానకొండూర్-1) ఆవరణలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు శనివారం నిరసన తెలిపారు. గత ప్రభుత్వం గురుకులాలను ప్రారంభించి అరకొర సౌకర్యాలున్న అద్దె భవనాల్లో నిర్వహించారన్నారు. ఈ క్రమంలో కొత్త టైం టేబుల్ సమర్థనీయంగా లేదని పేర్కొన్నారు. విద్యార్థులు 3 గంటలపాటు అసౌకర్యమైన తరగతి గదుల్లో కూర్చోవడం, ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు భోజనం చేయకుండా ఉండటం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు స్టాఫ్ క్వార్టర్స్ లేకుండా ఊరికి దూరంగా విద్యాసంస్థలున్న సందర్భంలో ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు రాత్రి 9 గంటల వరకు అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగ సెలవుల్లో కూడా పని చేయాల్సిన సందర్భంలో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు సైనిక విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: రుక్మాపూర్ శివారు సైనిక శిక్షణ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ క్రీడాపోటీల్లో అండర్-12, అండర్-10 కేటగిరీల్లో ఐదుగురు విద్యార్థులు సైనిక శిక్షణ పాఠశాల నుంచి ఎంపికయ్యారని డైరెక్టర్ కేసీ రావు, ప్రిన్సిపాల్ లచ్చయ్య తెలిపారు. విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్ ఇనాక్, పీఈటీ విక్రమ్‌ను వారు అభినందించారు.

ఎయిర్ బెడ్ అందజేత



ఎయిర్ బెడ్ అందజేస్తున్న పావని

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పైండ్ల రాజు మూడు సంవత్సరాల నుంచి వెన్నెముక నొప్పితో ఇబ్బంది పడుతూ మంచానికే పరిమితం కాగా.. ఆదరణ సేవాసమితి వారు శనివారం ఎయిర్ బెడ్‌ను అందజేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితం కావడంతో బాధితుడి ఇబ్బంది తెలుసుకున్న ఆదరణ సేవాసమితి వారు ఎయిర్ బెడ్‌ను అందజేశారని నిర్వాహకురాలు కర్రె పావని తెలిపారు. కర్రె రవి, చిమ్మల శ్రీనివాస్ ఉన్నారు.

ఎల్లలు లేని సేవాదృక్పథం



ట్రైసైకిల్ అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకుడు నరహరి(ఐఏఎస్)(ఫైల్)



తండ్రి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఐ విజన్ హాస్పిటల్

- నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధిలో సాయం
- అభాగ్యులకు అండగా ఆలయ ఫౌండేషన్ చేయూత
- నూతనంగా శంకర్ ఐ విజన్ హాస్పిటల్ ఏర్పాటు

సండే స్పెషల్



ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరహరి (ఐఏఎస్)

జమ్మికుంట: నిరుపేద కుటుంబాల్లోని అభాగ్యులకు ఆలయ ఫౌండేషన్ అండగా నిలుస్తోంది. విద్య, వైద్యం, ఉపాధితో వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఆలయ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎల్లలు లేని సేవాదృక్పథంగా ముందుకు సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాలకుర్తి మండలం, బసంత్‌నగర్‌కు చెందిన నరహరి ఐఏఎస్ అధికారి ఆలయ ఫౌండేషన్‌ను వ్యవస్థాపక అధ్యక్షుడి(ఫౌండర్)గా 2013లో స్థాపన చేశారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రిన్సిపల్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్లతో నిర్వహణ చేస్తున్నారు.

విద్య, వైద్యం..

టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మోటివేషన్ తరగతుల నిర్వహణ, లక్ష్యం చేరుకునేందుకు మార్గదర్శనం, పేద విద్యార్థులకు చదువుకు సంబంధించిన మెటీరియల్(పుస్తకాలు), ఫీజుల చెల్లింపులో సాయం అందిస్తున్నారు. సుమారు 2వేల మందికి సాయం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలు(ఏజెన్సీలు), గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రమాదం, ఇతర కారణాల వల్ల అవయవాలు కోల్పోయిన వారికి వీల్ చైర్లు ఉచితంగా అందిస్తున్నారు. రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చయ్యే జైపూర్ ఫుట్స్‌ను ఇప్పటివరకు వివిధ జిల్లాల్లో 3,250 మందికి, హుజూరాబాద్ నియోజకవర్గంలో 65 మందికి అందించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తలసేమియా వ్యాధి బారిన పడిన పిల్లల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రాణదాతలవుతున్నారు.

ఉపాధి..

చదువు మధ్యలో ఆపేసిన టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉపాధి నిమిత్తం శిక్షణ అందిస్తున్నారు. హైదరాబాద్‌లోని స్వర్ణ భారతి ట్రస్ట్ సౌజన్యంతో హౌస్ వైరింగ్, ఏసీ రిపేరింగ్, టూవీలర్ మెకానిజం, సీసీ కెమెరాల ఏర్పాటు, పనులపై శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధితో స్థిరపడేలా కృషి చేస్తున్నారు. మహిళలకు ఎంబ్రాయిడరింగ్, పీవోపీ ద్వారా ఉపాధి పొందేలా చూస్తున్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పిస్తూ ఉచితంగా శిక్షణ పొందిన అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా జారీ చేసిన సర్టిఫికెట్లు అందజేస్తారు.

తండ్రి స్మారకార్థం..

ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరికిపండ్ల నరహరి ఐఏఎస్.. తండ్రి పరికిపండ్ల సత్యనారాయణ స్మారకార్థం స్వగ్రామమైన బసంత్‌నగర్‌లో 2023లో శంకర్ విజన్ ఐ హాస్పిటల్ భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. పేద ప్రజలకు ఉచిత కంటి చికిత్స చేస్తున్నారు. సంవత్సరకాలంలో 800 మందికి ఆపరేషన్లు, 6వేల వైద్య పరీక్షలు చేస్తున్నారు. పరికిపండ్ల రామ్ శంకర్ ఐ విజన్ సెంటర్ సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

9 సంవత్సరాలుగా..



ఆలయ ఫౌండేషన్‌లో 9 సంవత్సరాలుగా పని చేస్తున్నా. పేదలకు విద్య, వైద్యం, యువతీయువకులకు ఉపాధిపై, ఫౌండేషన్‌ను సంప్రదించిన నిరుపేదలకు చేయూతనందిస్తున్నా. రానున్న రోజుల్లో మరింత మందికి సేవ చేస్తా. ఫోన్ నంబర్ 9652110751ను సంప్రదించాలి.

– గాదె గుణసాగర్, స్టేట్ కోఆర్డినేటర్, జమ్మికుంట

ఉచితంగా కంటి ఆపరేషన్



కళ్లు పూర్తి మసకగా కనిపిస్తున్నాయని ఆలయ ఫౌండేషన్ నిర్వాహకులను సంప్రదించా. శంకర్ ఐ హాస్పిటల్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి మందులు అందించారు. ఆపరేషన్‌తో మంచిగా కళ్లు కనబడుతున్నాయి. ఆలయ ఫౌండేషన్ వారికి రుణపడి ఉంటా.

– గాదె లలితమ్మ, కొత్తపల్లి, జమ్మికుంట

పాఠశాల తనిఖీ



హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూచనలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి బోధన తీరుపై పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వం విడుదల చేసిన గైడ్‌లైన్స్ ప్రకారంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధన జరపాలని సూచించారు. ఏఎంవో అశోక్ రెడ్డి, హెచ్ఎం సత్యప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు అన్నారు. ఆకాడమిక్ గైడ్‌లైన్స్ పాఠశాలల్లో అమలు తీరుపై పర్యవేక్షణలో భాగంగా శనివారం మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. జిల్లా సెక్టోరల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విడపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన పనులు పూర్తి చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

రామడుగు: మండల కేంద్రానికి సమీపంలో మోతె వాగుపై నూతన వంతెన నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు దర్శెట్టి రమేశ్ ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాత బ్రిడ్జి గతేడాది కురిసిన వర్షాలతో కుంగిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందని, కొత్తగా బ్రిడ్జి నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉండడంతో మళ్లీ వర్షాలు కురిస్తే తిప్పలు తప్పవన్నారు. బీజేవైఎం నాయకులు పోచంపల్లి నరేశ్, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, ఎడవెల్లి రాము, ఎడవెల్లి లక్ష్మణ్, దయ్యాల రాజు, బండారి శ్రీనివాస్, చందు, అనిల్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళి



హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పట్టణంలోని 34వ బూత్‌లో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అమ్మ పేరిట మొక్కను నాటారు. పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, తూర్పాటి రాజు, యాళ్ల సంజీవరెడ్డి, తిప్పబత్తిని రాజు, పంజాల మనోజ్, కొలిపాక వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న నిదాన్ష్ బంధువులు

జమ్మికుంట: కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమంలో పల్లె లవ్‌కుమార్, విజయలక్ష్మి మనుమడు నిదాన్ష్ మొదటి పుట్టిన రోజు వేడుకలను శనివారం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలో నిర్వాహకులకు నిత్యావసర సరుకులు అందజేసి అన్నదానం చేశారు. దేశిని కోటి, కుష్‌కుమార్, ఆశ్రమంలోని పిల్లలున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. కులాలు, మతాల మధ్య అసమానతలు సృష్టిస్తూ బీజేపీ రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రయత్నం చేస్తోందన్నారు. జిల్లాస్థాయిలో ఉన్న కార్యకర్తలు సామాజిక స్పృహతో మతోన్మాద చర్యలను ఎక్కడికక్కడ ఎండగడుతూ రాజకీయంగా, సామాజికంగా నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వర్ణ వెంకట్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, రాజిరెడ్డి, మండల నాయకులు కొప్పుల శంకర్, సంపత్‌రావు, దండిగారి సతీష్, చెల్పూరి రాములు, వడ్లూరు కిషోర్, రాజు, గుండేటి వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న విష్ణు

జమ్మికుంట: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అటెండర్ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించి విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. నాయకులు ఇల్లందుల శ్రీనాథ్, మొలుగూరి వినయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న డా.మధుసూదన్‌రెడ్డి

జమ్మికుంట: సామాజిక శాస్త్రాలపై లోతుగా అధ్యయనం చేయాలని హన్మకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్యాకల్టీ ఫోరం ఆధ్వర్యంలో సామాజిక శాస్త్రాల జ్ఞాన శాస్త్రం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జ్ఞానం, పుట్టుక, స్వభావం పరిమితులు, వాస్తవాలు, విలువలకు మధ్య వైరుధ్యాలు, సామాజిక శాస్త్రాల పాత్రపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, స్టాఫ్ సెక్రటరీ డా.రామ్మోహన్‌రావు, అధ్యాపకులు మహిందర్‌రావు, ఎడమ శ్రీనివాస్‌రెడ్డి, డా.శ్రీలత, పిడి సుజాత, ఈశ్వరయ్య, స్వరూపరాణి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పదోన్నతులు, బదిలీలతో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వీరిని శనివారం సన్మానించారు. పొలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశేష సేవలు అందించి ఇటీవల బదిలీపై వెళ్లిన తెలుగు ఉపాధ్యాయుడు కుంట లచ్చయ్య, పదోన్నతిపై వెళ్లిన హిందీ ఉపాధ్యాయుడు శ్రీనివాస జియ్యంగార్, అబ్దుల్ వలీని విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాస్, ఎం.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న వేణువినోద్

హుజూరాబాద్‌రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో చోటుచేసుకుంటున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వేణువినోద్ అన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఐక్యూఏసీ ఇంటర్నల్ క్వాలిటీ అసురన్స్ సెల్ ఆధ్వర్యంలో డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన క్వాలిటీ ఎం హాన్స్‌మెంట్ ఇన్ టెక్నికల్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. బోధన నాణ్యత పెంచడంలో అధ్యాపకుల భూమిక చాలా గొప్పదన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో కళాశాల రేటింగ్ బాగుంటే అడ్మిషన్లు మంచిగుంటాయన్నారు. కళాశాల ఐక్యూఏసీ డీన్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వి.సతీష్‌కుమార్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.వేణుగోపాల్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి



హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



మానకొండూర్: నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి తదితరులు

హుజూరాబాద్: బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కరీంనగర్ రోడ్‌లో గల జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జ్యోతిరావు పూలే జయంతి కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్, అంబేడ్కర్ జయంతి కమిటీ చైర్మన్ మహమ్మద్ ఖాలీక్ హుస్సేన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఇమ్మడి దయాకర్, దళిత, బహుజన ప్రజాసంఘాల నాయకులు వేల్పుల రత్నం, ఎర్ర శ్రీధర్, డాక్టర్ తడికమళ్ల శేఖర్, తునికి సమ్మయ్య, చందుపట్ల జనార్దన్, ఇల్లందుల సమ్మయ్య, వేల్పుల ప్రభాకర్, బోరగాల సారయ్య, కలవల మల్లయ్య, అంబాల రవీందర్, ఎర్ర కుమార్, రామ్ రాజేశ్వర్, వేల్పుల భాస్కర్, అరికిళ్ల ఐలయ్య, గాజుల సంపత్, వేల్పుల భాస్కర్, కొంకటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు కొల్లూరి కిరణ్‌కుమార్, సొల్లు బాబు, నేరెళ్ల మహేందర్‌గౌడ్, మేకల తిరుపతి, మిడిదొడ్డి రాజు, ఎండీ అఫ్సర్, ఆలేటి సుశీల, లంకదాసరి లావణ్య, పుష్పలత, గంట కిరణ్‌రెడ్డి, బండారి సదానందం, పుల్ల రాధ, కడారి తిరుమల, రేణుక, గోస్కుల రిబ్కా, సునీత, వేల్పుల విజయ్, నర్సింగ్ రాకేశ్, వెంకటేశ్ తదితరులున్నారు.

మానకొండూర్: జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులు నిర్వహించారు. మండల కేంద్రంలోని తూర్పు ధర్వాజ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

మానకొండూర్ సీఐ బదిలీ

మానకొండూర్: మానకొండూర్ సీఐ మాదాసు రాజ్‌కుమార్ శనివారం బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడ 22 నెలలపాటు విధులు నిర్వహించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల టాస్క్‌ఫోర్స్2కు బదిలీ అయ్యారు. జి.సదన్‌కుమార్ మానకొండూర్ సీఐగా రానున్నారని ఉత్తర్వులు వెలువడ్డాయి.

బీమా చెక్కు అందజేత

సైదాపూర్: గొడిశాలలో పురుషుల పొదుపు సమితి నుంచి మంజూరైన రూ.75,284 బీమా చెక్కును పొదుపు సమితి అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. పురుషుల పొదుపు సంఘంలో సభ్యుడిగా కొనసాగిన నెల్లి చంద్రమౌళి ఇటీవల మృతిచెందగా.. పొదుపు సంఘం నుంచి మంజూరైన రూ.75,284 చెక్కును మృతుడి భార్య లావణ్యకు అందజేశారు. సంఘం అధ్యక్షుడు అమరేందర్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

సివిల్ సప్లై అధికారుల తనిఖీ



శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో గల రాజరాజేశ్వర పారాబాయిల్డ్ రెస్‌మిల్లును శనివారం సివిల్ సప్లై అధికారులు తనిఖీ చేశారు. తనిఖీలో 680 క్వింటాళ్ల ధాన్యంలో వ్యత్యాసం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సివిల్ సప్లై జగిత్యాల డీఎం హతీరాం, డీటీసీఎస్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఏఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ఆటో డ్రైవర్



గుంతలో మట్టి నింపుతున్న దుర్గయ్య

చొప్పదండి: చొప్పదండిలోని కరీంనగర్ రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలో రహదారిపై ఏర్పడ్డ గుంతలను పట్టణానికి చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్ వడ్లూరి దుర్గయ్య శనివారం పూడ్చివేశాడు. ట్రాలీలో మొరం తీసుకువచ్చి గుంతలను నింపాడు. గుమ్లాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి పెట్రోల్ బంకు వరకు రాష్ట్ర రహదారిపై గుంతలు ఏర్పడి రోజురోజుకు పెద్దగా అవుతుండటంతో వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి మరణాలు కూడా సంభవించాయి. అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో ట్రాలీ ఆటో దుపుకొని జీవనం వెళ్లదీసే దుర్గయ్య గుంతలు పూడ్చాడు. ఏటా రోడ్డుపై గుంతలను పూడుస్తూ ఆదర్శంగా నిలుస్తుండగా, అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అరవిందరెడ్డి తెలిపారు. లైన్స్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నుస్తులాపూర్, రామకృష్ణకాలనీ, కొత్తపల్లి, ఇందిరానగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యపై ఖండన

చొప్పదండి: తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను ఖండిస్తున్నట్లు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ప్రశ్నించే గొంతులపై, ప్రజాస్వామ్యవాదులపై హత్యలు, దాడులు పెరిగిపోయాయని విమర్శించారు.